సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 22 । జూలై । 2025



కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కి 349 వినతులు 10లో



మాస్టర్ ప్లాన్ రోడ్డు మూసివేతపై ఆందోళన 10లో



సీతమ్మధారలో 9 తులాల బంగారం చోరీ 10లో

న్యూస్‌రీల్

పైపులైన్ లీకులుంటే సమాచారం ఇవ్వండి



దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో ఎక్కడైనా తాగు నీటి పైప్‌లైన్లు లీకైనా, మురుగు కాలువల్లో నీరు కలిసిపోవడాన్ని గమనించినా వెంటనే ఆయా జోనల్ కమిషనర్‌కు, వార్డు కార్యదర్శులకు, నీటి సరఫరా సహాయక ఇంజినీర్‌కు, సిటీ ఆపరేషన్ సెంటర్‌కు సమాచారం అందించాలని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నీటి పైప్‌లైన్ సమస్యలను తెలియజేయడానికి జీవీఎంసీ సిటీ ఆపరేషన్ సెంటర్ 24 గంటలూ అందుబాటులో ఉంటుందని కమిషనర్ తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 18004250009కు లేదా 0891–2507225కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. జీవీఎంసీ పరిధిలోని ప్రజలకు ప్రతిరోజూ క్లోరిన్‌తో శుద్ధి చేసి, నాణ్యత పరీక్షించిన సురక్షిత తాగునీటినే సరఫరా చేస్తున్నామని తెలిపారు. అదే సమయంలో, ప్రజలు కూడా నీటి ద్వారా వ్యాపించే కలరా, డయేరియా వంటి వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ధరల పట్టిక తప్పనిసరి



సీతంపేట: జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లు నిర్వహించే యాజమాన్యాలు టెస్టుల ధరల పట్టికను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2002, రూల్ నంబరు 9 ప్రకారం ధరలను ప్రదర్శించడమే కాక, దానికి సంబంధించిన బిల్లు పేషెంట్‌కు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీలోగా అమలు చేసి, వివరాలు వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయానికి తెలియజేయాలని తెలిపారు.

కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు



తాటిచెట్లపాలెం: వాల్తేరు రైల్వే డివిజన్ పరిధిలో భద్రతా పనుల దృష్ట్యా, విశాఖ-కిరండూల్ మధ్య నడిచే కొన్ని రైళ్లు తాత్కాలికంగా పాక్షికంగా రద్దయ్యాయని వాల్తేరు డివిజన్ అధికారులు తెలిపారు. ఈనెల 23, 24, 25వ తేదీల్లో విశాఖ-కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కేవలం కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 24 నుంచి 26 వరకు కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖ (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు విశాఖ-కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ స్టేషన్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో బుధవారం నుంచి 26వ తేదీ వరకు కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖ(58502) పాసింజర్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది.


25న జాబ్ మేళా

కంచరపాలెం: వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న సుమారు 180 ఉద్యోగాల భర్తీ కోసం స్థానిక నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్(ఎన్‌సీఎస్‌సీ)లో 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ ఉప ప్రాంతీయ అధికారి నిట్టల శ్యామ్‌సుందర్ తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఇంటర్న్‌షిప్ ట్రైనీస్, సేల్స్ మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్, డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన 18–35 ఏళ్ల మధ్య వయసున్న స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెంలోని ఎన్‌సీఎస్‌సీ కేంద్రానికి ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాల్సిందిగా కోరారు.

బీజేపీ జిల్లా సంస్థాగత సంఘాల సభ్యుల నియామకం

ఎంవీపీకాలనీ: భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో పలు సంస్థాగత సంఘాల సభ్యుల నియామకం సోమవారం జరిగింది. ఈ మేరకు బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు ప్రకటనలో తెలిపారు. జిల్లా కార్యవర్గ సంఘంలో 21 మంది పార్టీ నాయకులకు చోటు కల్పించారు. అధ్యక్షుడితో పాటు 8 మంది ఉపాధ్యక్షులు, ఇద్దరు ప్రధాన కార్యదర్శులు, 8 మంది కార్యదర్శులు, ట్రెజరర్, సోషల్ మీడియా కన్వీనర్, ఐటీ సెల్ కన్వీనర్‌లను ఈ కార్యవర్గ సంఘంలో నియమించారు. దీంతో పాటు వివిధ నియోజకవర్గాలకు సంబంధించి 31 మందితో డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కమిటీని నియమించారు.

రేసర్ల జోరు.. జనం బేజారు





పోర్టు స్టేడియంలో గెట్ టు గెదర్ అయిన సూపర్ బైకర్లు

రాత్రుళ్లు రేసింగ్‌లతో యువత హల్‌చల్

- అడవివరం, రుషికొండ, భీమిలి, భోగాపురం ప్రాంతాల్లో పోటీలు
- రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షల ఖరీదైన బైక్‌లతో స్టంట్లు
- 'వీ సూపర్ బైకర్స్' పేరుతో అసోసియేషన్ ఏర్పాటు
- ఇటీవలే పోర్టు స్టేడియంలో తొలి వార్షికోత్సవం నిర్వహణ
- రేసర్ల స్పీడ్‌కు బ్రేకులు వేయలేకపోతున్న పోలీసులు

విశాఖ సిటీ : వారంతా సంపన్న కుటుంబాలకు చెందిన యువత. వారి ఒక్కో బైక్ రూ.15 లక్షలకు పైమాటే. ఇవి 200 నుంచి 300 కి.మీ వేగంతో పరుగులు పెడతాయి. అటువంటి స్పోర్ట్స్ బైక్‌లపై రేసింగ్‌లతో కుర్రకారు విశాఖ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. థ్రిల్ కోసం వేగంతో పోటీపడుతున్నారు. 'అదుపు' తప్పితే కలిగే దుష్పరిణామాలను అంచనా వేయలేకపోతున్నారు. దురదృష్టం వెంటాడితే తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు. విశాఖలో రేసింగ్ సంస్కృతి పెచ్చుమీరుతోంది. స్మార్ట్ సిటీ బైక్ రేసర్లకు కేంద్రంగా మారుతోంది. విశాలమైన రహదారుల్లో యువత వేగానికి బ్రేకులు లేకుండా పోతున్నాయి. అర్ధరాత్రుళ్లు వారు చేస్తున్న స్టంట్స్ ఒళ్లు గగుర్పాటుకు గురిచేస్తున్నాయి.

ప్రత్యేకంగా అసోసియేషన్

విశాఖలో రేసింగ్ కల్చర్ పెరుగుతోంది. గతంలో అప్పుడప్పుడు జరిగే బైక్ రేసులు.. ఇప్పుడు వారాంతానికి దర్శనమిస్తున్నాయి. సంపన్న వర్గాలకు చెందిన కుర్రకారు స్పోర్ట్స్ బైక్‌లతో చేసే విన్యాసాలకు విశాఖ రహదారులు ప్రత్యక్ష సాక్షులుగా మారిపోయాయి. పేరున్న కళాశాలలో ఉన్నత చదువులు చదువుతున్న యువతే ఈ రేసింగ్‌లతో రెచ్చిపోతున్నారు. వీరి ఒక్కో బైక్ ఖరీదు రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలు. గంటకు గరిష్టంగా 200 నుంచి 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం వీటి ప్రత్యేకత. ముందు హోదా, సరదా కోసమే వీటిని కొనుగోలు చేస్తూ.. తర్వాత మాత్రం రేసుల్లో పోటీపడుతున్నారు. ఇటువంటి ఖరీదైన సూపర్ బైక్‌లు ఉన్నవారంతా ఒక గ్రూప్‌గా ఏర్పాటవడం గమనార్హం. వీరంతా 'వీ సూపర్ బైకర్స్' పేరుతో ఒక అసోసియేషన్‌లా ఏర్పాటు చేసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వేదికలపై గ్రూపులుగా ఏర్పాటు చేసుకుని కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఈ అసోసియేషన్ ఏర్పాటై ఏడాదైన సందర్భంగా రెండు రోజుల క్రితమే పోర్టు స్టేడియంలో గెట్ టు గెదర్‌ను నిర్వహించినట్లు తెలుస్తోంది.

శివారు ప్రాంతాల్లో రేసింగ్‌లు

స్మార్ట్ సిటీ, ఆర్థిక రాజధాని విశాఖలో రహదారుల అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా శివారు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ చేపట్టారు. ఇదే రేసర్లకు వరంగా మారింది. గతంలో బీచ్ రోడ్డు, ఆరిలోవ బీఆర్‌టీఎస్, విశాఖ వ్యాలీ రోడ్లలో రేసులు నిర్వహించేవారు. పోలీసులు ఈ రేసింగ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేసి పలువురిని అరెస్టులు చేశారు. దీంతో ఇప్పుడు ఈ రేసర్లు శివారు ప్రాంతాలకు మకాం మార్చారు. రుషికొండ ఐటీ హిల్స్ రోడ్డు,



పనోరమ అపార్ట్‌మెంట్ రోడ్డు, తిమ్మాపురం నుంచి భీమిలి, మధురవాడ-బావికొండ, మారికవలస-తిమ్మాపురం బీచ్‌రోడ్డు వంటి ప్రాంతాలతో పాటు ఇటీవల కాలంలో భోగాపురం వైపు కూడా రేసింగ్‌లకు అనువైన ప్రాంతాలుగా ఎంచుకుంటున్నారు. గతంలో శని, ఆదివారాల్లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించే వారు. కొన్నాళ్ల నుంచి వీకెండ్ వరకు ఆగకుండా వీలు చిక్కినప్పుడల్లా రయ్‌మంటూ రేసుగుర్రాల్లా దూసుకుపోతున్నారు. సింగిల్ టైర్ రైడ్, సైడ్ హ్యాంగింగ్ రైడ్, జిగ్ జాగ్, స్నేక్ రైడ్, 360 డిగ్రీస్, 120 యాంగిల్, ఫ్రంట్ లీ, బ్యాక్ లీ.. పేర్లతో పిలిచే డేంజరస్ స్టంట్‌లకు పాల్పడుతున్నారు.

స్పీడ్‌కు బ్రేకులు వేయలేకపోతున్న పోలీసులు

ఇంజనీరింగ్ విద్యార్థులు, ఐటీ ఉద్యోగులే ఈ రేసింగ్‌లకు పాల్పడుతున్నారన్న వాస్తవం పోలీసులను సైతం విస్మయపరుస్తోంది. రేసింగ్‌కు పాల్పడేవారంతా వాట్సాప్, ఇన్‌స్టా గ్రామ్‌లో గ్రూపులుగా ఏర్పడి రేసింగ్ ఎక్కడ నిర్వహించేదీ సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు. ఒక్కొక్కరుగా అక్కడికి చేరుకుని జిగ్‌జాగ్‌లు, స్పీడ్ డ్రైవింగ్, స్టంట్‌లు వంటి వాటిపై పోటీలు పెట్టుకుంటున్నారు. ఆ సమయంలో అదే రోడ్డుపై వెళ్లే వాహనచోదకులు వారిని చూసి ఆందోళనకు గురై ప్రమాదాల బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయని పోలీసులే చెబుతున్నారు. ఈ రేసింగ్ జాడ్యాన్ని కట్టడి చేసేందుకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. యువత స్పీడుకు పూర్తి స్థాయిలో బ్రేకులు వేయలేకపోతున్నారు. గత ఏడాది కాలంలో మూడుసార్లు బైక్ రేసర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రుల సమక్షంలోనే కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ అనేక మందిలో మార్పు రాలేదు. ఇప్పటికీ రేసులు చేస్తూనే ఉన్నారు. మరో వైపు పోలీసులు సైతం శివారు ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెట్టాలని భావిస్తున్నారు. ప్రధానంగా రాత్రివేళ గస్తీ పెంచడంతో బైక్ రేసర్ల ఆటకట్టించాలని ఆలోచన చేస్తున్నారు.

ఆగస్టు 6న స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నిక వచ్చే నెల 6న జరగనుంది. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న 10 మంది స్థాయీ సభ్యుల కాల పరిమితి ముగియనున్నందున, కొత్త వారిని ఎన్నుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల నోటీస్ బోర్డుల్లో ఓటర్ల జాబితా, ఎలక్షన్ నోటీస్ ప్రచురించారు. నామినేషన్ పత్రాలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉన్న కార్యదర్శి విభాగం పని వేళల్లో పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 29 వరకు రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ అదనపు కమిషనర్(జనరల్) కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 29న సాయంత్రం 5 వరకు అందిన నామినేషన్ల జాబితాను ప్రచురించి, 30న ఉదయం 11 నుంచి నామినేషన్ల పరిశీలన, సాయంత్రం అర్హుల జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 2 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువుగా పేర్కొన్నారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. 6న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

కొత్త పరికరాల కొనుగోలుకు సన్నాహాలు

సాక్షి ఎఫెక్ట్..

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయని కింగ్ జార్జి ఆస్పత్రి(కేజీహెచ్)లో నిలిచిన హృద్రోగ శస్త్రచికిత్సలపై 'పేదోడి గుండెకోత' పేరిట ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొత్త పరికరాల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. సీఎస్సార్ నిధులు, ఎంపీ నిధుల ద్వారా లేదా జిల్లా కలెక్టర్ ద్వారా ఈ పరికరాలు కొనుగోలుచేసి, శస్త్రచికిత్సలు పునఃప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కొత్త పరికరాల కొనుగోలులో జాప్యం జరగవచ్చని, ఈ లోగా పరికరాలు అద్దెకు తెచ్చే ప్రతిపాదనకు కసరత్తులు జరుగుతున్నాయన్నారు. అందుకు జిల్లా కలెక్టర్ కూడా ఆమోద ముద్ర వేసినట్లు తెలిపారు. 15 రోజుల్లో ఈ పరికరాలతో తిరిగి పూర్తి స్థాయిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు.

సూపర్‌సిక్స్ పేరిట కూటమి నయవంచన



బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకుడు జాన్‌వెస్లీ, తదితరులు

- వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పథకాలు ప్రజలెవరూ మరచిపోలేనివని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. పార్టీ 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పరిషత్ సమీపాన ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో పోర్టు అభివృద్ధి, ప్రతి వార్డుకు రెండు కోట్లకు పైగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించారన్నారు. విద్యార్థులందరికీ అండగా నిలిచారని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, మహిళలు, పేదలకు సంక్షేమ పథకాలు చేరువ చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు.

ప్రజల్లోకి కూటమి ప్రభుత్వ మోసాలు

కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరగా ఎన్నికల హామీలపై చేస్తున్న మోసాలు, దగా, కుట్ర రాజకీయాలపై ప్రజల్లో చైతన్యం నింపాలని పార్టీ శ్రేణులకు వాసుపల్లి పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు సంక్షేమాన్ని ప్రజలకు డబుల్ డిజిట్‌లో అందిస్తామని, సూపర్ సిక్స్ పేరిట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. ప్రజలకు సంక్షేమం అందాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలన్నారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్ మాట్లాడుతూ అమలు కాని హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. అనంతరం కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కనకల ఈశ్వర్, జిల్లా వికలాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి కోట ఆనంద ప్రసాద్, ఆర్టీఐ విభాగం కార్యదర్శి ఆరుగుల రాజ్ కుమార్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నీలాపు లక్ష్మి, బెవర మహేష్, బొండాడ వెంకటరమణ, గుమ్మడి చంద్రమౌళి, పడాల సూర్యకుమార్, కొండ్రు సతీష్, గొర్రిపాటి శివ, దుక్క గోపి, అడపా శివ, కోరాడ సురేష్, బుల్లెట్ రవి, తమ్మినేని శ్రీను, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొందరికేనా తల్లికి వందనం

- తల్లుల ఆగ్రహం
- కలెక్టరేట్‌కు క్యూ కట్టిన వైనం
- వివిధ కారణాలు చూపి అర్హులకు వర్తింపజేయని వైనం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లులు
- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 70 ఫిర్యాదులు



సమగ్ర శిక్షణ అభియాన్ అధికారితో సమస్యలు చెప్పుకుంటున్న తల్లులు

బీచ్‌రోడ్డు: 'తల్లికి వందనం' పథకం ఇప్పుడు తల్లుల ఆగ్రహానికి కారణమవుతోంది. ఎన్నికలకు ముందు ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఈ పథకం వర్తింపజేస్తామని గొప్పగా హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి, ఇప్పుడు అవే మాటలను గాలికొదిలేసింది. ఏడాది ఆలస్యంగా పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం, అర్హత నిబంధనలను కఠినతరం చేసి, లక్షలాది మంది తల్లులను పథకానికి దూరం చేసింది. దీంతో భారీగా లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయింది. హామీ ఇచ్చింది ఒకటి, ఇప్పుడు అమలు చేస్తున్నది ఇంకొకటి కావడంతో తల్లులు మోసపోయినట్లు భావిస్తున్నారు. ఈ దగాను నిరసిస్తూ తమకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు క్యూ కట్టారు.

కలెక్టరేట్‌లో 70 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి దాదాపు 70 మంది తల్లులు హాజరై, తమకు 'తల్లికి వందనం' రాలేదని ఫిర్యాదు చేశారు. తాము అన్ని విధాలా అర్హులైనప్పటికీ డబ్బులు ఎందుకు అందడం లేదో తెలియడం లేదని కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. భారీ సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో సమగ్ర శిక్షణ అభియాన్ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు.

ఉచిత సీట్లు పొందిన వారికి పథకం కట్

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు పొందిన పేద విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం వర్తించడం లేదు. వచ్చిన ఫిర్యాదుల్లో చాలా మందికి ఇదే సమస్యతో ఫిర్యాదులు చేశారు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత సీట్లు పొందిన వారికి కూడా 'అమ్మ ఒడి' పథకం అమలు చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అర్హుల సంఖ్యను తగ్గించే ఉద్దేశ్యంతో ఇలా సరికొత్త నిబంధనలను తీసుకొచ్చిందని తల్లులు విమర్శిస్తున్నారు.

ఒకరికి ఉచిత సీటు వచ్చినా..

కూటమి ప్రభుత్వం విధించిన మరో విచిత్రమైన నిబంధన ఏమిటంటే, ఒకే ఇంట్లో ఒక పిల్లవాడికి ఉచిత సీటు వస్తే, అదే ఇంట్లోని మరో విద్యార్థికి కూడా 'తల్లికి వందనం' పథకాన్ని నిలిపివేస్తున్నారు. ఎన్నికల హామీల్లో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి 'తల్లికి వందనం' ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు, ఇప్పుడు ఇంట్లో ఒకరికి ఉచిత సీటు వచ్చినా, మిగిలిన వారికి పథకాన్ని రద్దు చేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అంతేకాకుండా ఉచిత సీటు రాని వారికి కూడా 'ఉచిత సీటు వచ్చింది' అని ఆన్‌లైన్‌లో చూపించి పథకం నిలుపుదల చేస్తున్నారని తల్లులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు



నాకు ఇద్దరు పిల్లలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పడింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం ఇద్దరికి పిల్లలకు పడలేదు. కారణం ఏంటని ఆరా తీస్తే నా పెద్ద కుమారుడికి ఉచిత సీటు వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. కానీ మాకు ఎలాంటి ఉచిత సీటు రాలేదు. నేను జనసేన కార్యకర్తను.. నాకే ఇలా జరిగడంతో మా వీధిలో వాళ్లు నన్ను చూసి నవ్వుతున్నారు.

–డి నూకరత్నం, కోడిపందాలవీధి

అధికారులు స్పందించాలి



నాకు ఓ కుమార్తె ఉంది. గత ఏడాది ఒకటో తరగతిలో ప్రవేశానికి ఉచిత సీటు కోసం దరఖాస్తు చేశాం. ఓ ప్రైవేటు స్కూల్‌లో సీటు వచ్చింది. ఇతర ఫీజులు ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వ స్కూల్‌లోనే చేర్పించాం. అయితే ఉచిత సీటు పొందినందున తల్లికి వందనం ఆపేశారు. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

–ఎ.సాహిత్య, వాంబే కాలనీ

విద్యుత్ బిల్లు నంబరు తప్పుగా నమోదు చేశారు




మాకు తల్లికి వందనం పడలేదు. కారణం ఏంటని అడిగితే విద్యుత్ వినియోగం అధికం అని ఉందని ఆపేశారట. బిల్లు నంబర్ చూస్తే అది వేరేవాళ్లది. అధికారులు తప్పుగా నమోదు చేశారు. దీంతో తల్లికి వందనం పథకానికి నోచుకోలేదు. అధికారులు తప్పును సరిచేసి తల్లికి వందనం పడేలా చర్యలు తీసుకోవాలి.

– ఎస్ భావని, వేంకటేశ్వర కాలనీ

ఏయూలో బీటెక్ క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు

- ఈఏపీ సెట్ ద్వారా అడ్మిషన్లు
- తొలి ఏడాది 30 మందికి ప్రవేశాలు
- పలు అంశాలకు ఏయూ అకడమిక్ సెనేట్ ఆమోదం



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్, పాల్గొన్న పూర్వ వీసీలు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీటెక్ క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్స్‌కు సెనేట్ ఆమోదం తెలిపింది. సోమవారం నిర్వహించిన అకడమిక్ సెనేట్ సమావేశంలో సభ్యులు ఈ మేరకు తీర్మానించారు. ఈ కోర్సులో ప్రవేశాలను ఈఏపీ సెట్ ద్వారా నిర్వహిస్తారు. ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ విభాగం నిర్వహించే ఈ కోర్సులో తొలి బ్యాచ్‌లో 30 మందికి ప్రవేశాలను కల్పించనున్నారు. ఈ మేరకు సెనేట్ పలు తీర్మానాలకు ఆమోదం తెలిపింది.

- మెటీరియాలజీ ఓషనోగ్రఫీ విభాగం నుంచి గతంలో నిలిపివేసిన ఎంటెక్ అట్మాస్పియరిక్ సైన్స్, ఓషియానిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి పునః ప్రారంభించాలని నిర్ణయించింది.
- ఇంజనీరింగ్ కళాశాలలో పలు విభాగాల్లో డ్యూయల్ డిగ్రీ చేయడానికి ఆమోదం తెలిపింది.
- ఏయూ దూర విద్య కేంద్రం నుంచి అన్ని పీజీ కోర్సులకు వార్షిక పరీక్షల స్థానంలో సెమిస్టర్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించింది.
- సైన్స్ కళాశాల పరిధిలో పలు విభాగాల్లో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించింది.
- మెరైన్ లివింగ్ రిసోర్స్ విభాగం నుంచి ఆక్వా కల్చర్‌లో ఏడాది కాలవ్యవధితో పీజీ డిప్లమో కోర్సుకు ఆమోద ముద్ర వేసింది.

సమావేశంలో మాజీ ఉపకులపతులు మాట్లాడుతూ ఏయూ చిత్రకళా విభాగం, థియేటర్ ఆర్ట్స్ విభాగాలను సమన్వయం చేస్తూ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఏర్పాటును ప్రతిపాదించారు. సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌ను బలోపేతం చేయాలని సూచించారు. త్వరలోనే సమగ్ర ప్రతిపాదనలతో ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు వీసీ రాజశేఖర్ పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయ విధి విధానాలను వివరించారు. సమావేశంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, మాజీ వీసీలు ఆచార్య ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఆచార్య జి.నాగేశ్వరరావు, ఆచార్య పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు, కళాశాల ప్రిన్సిపాళ్లు, ఫ్యాకల్టీ చైర్మన్లు, అకడమిక్ సెనేట్ సభ్యులు పాల్గొన్నారు.

మారని కూటమి నాయకుల తీరు

- పెందుర్తి తహసీల్దార్‌గా వెంకట అప్పారావు
- డీటీగా కొనసాగనున్న సంతోష్ కిరణ్

పెందుర్తి: పెందుర్తి తహసీల్దార్ పోస్టులో కూటమి నేతల రాజకీయం కొనసాగుతోంది. అధికార కూటమి రాజకీయ వైకుంఠ పాళీలో అడ్‌హక్ పదోన్నతి పొంది, ప్రస్తుతం డీటీగా పరిమితమైన సంతోష్ కిరణ్ సమిథగా మారారు. వారం రోజుల క్రితం తహసీల్దార్‌గా(అడహక్) నియమితులైన డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కిరణ్‌ను మళ్లీ అదే పోస్టుకు పరిమితం చేయడం చర్చనీయాంశమైంది. ఆయన స్థానంలో నూతన తహసీల్దార్‌గా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీలో తహసీల్దార్(అడహక్)గా విధులు నిర్వహిస్తున్న ఐ.వెంకట అప్పారావును నియమిస్తూ కలెక్టర్ హరేందిరప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో వెంకట అప్పారావు పెందుర్తి రెవెన్యూ బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే నియోజకవర్గంలో టీడీపీ, జనసేన ముఖ్య నాయకుల మధ్య ఆధిపత్య పోరులో భాగంగానే తహసీల్దార్లతో జిల్లా ఉన్నతాధారులకు బంతాట ఆడుతున్నట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ భూముల పందేరంతో పాటు ఇతర పనుల విషయంలో కూటమి నాయకుల ఒత్తిడి మేరకు అధికారులు అనాలోచితంగా చేసిన పనులే ఈ మార్పులకు కారణంగా తెలుస్తోంది. మొత్తానికి కూటమి నాయకుల చదరంగంలో అధికారులే పావులవుతున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని విద్యార్థి మృతి


మృతుడు హర్షవర్ధన్ సింగ్

పీఎం పాలెం: బస్సు ఢీకొన్న ఘటనలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి హర్షవర్ధన్ సింగ్ (13) మృతి చెందాడు. సోమవారం సాయంత్రం 3:30 గంటలకు పీఎం పాలెం ఆఖరి బస్టాప్ నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డు సమీపంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బక్కన్నపాలెంలో నివసించే ప్రమోద్ సింగ్ కుమారుడైన హర్షవర్ధన్.. నగరంలోని సెయింట్ ఆన్స్ ప్యారిస్ స్కూల్లో చదువుతున్నాడు. తన తండ్రి కారుషెడ్ కూడలి వద్ద నిర్వహిస్తున్న ప్లాస్టిక్ గృహోపకరణాల షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం హర్షవర్ధన్ షాపునకు వెళ్లి తిరిగి సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. బక్కన్నపాలెం రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న శ్రీ ప్రకాష్ స్కూల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సైకిల్ పై నుంచి కిందపడిన విద్యార్థి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాము సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

స్వీకరణే..పరిష్కారం శూన్యం

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌పై ప్రజల పెదవి విరుపు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో పలు కీలక సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు, మాస్టర్ ప్లాన్ రోడ్లలో లైట్లు లేని ప్రాంతాల ప్రజలు, బరీయల్ గ్రౌండ్ సమస్యపై ఆ ప్రాంత వాసులు, జీతాలు పెంచాలని కోరుతున్న లైఫ్‌గార్డ్‌లు, వార్డుల వారీగా మౌలిక సదుపాయాల సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. సమస్యల పరిష్కారంలో జాప్యంపై ఫిర్యాదుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 118 వినతులు అందాయి.

- **టిడ్కో ఇళ్లు:** రూ. 3.20 లక్షలు కట్టినా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని 6వ వార్డుకు చెందిన షేక్ సుభాన్ ఆవేదన చెందారు.
- **వీధి దీపాలు:** పదేళ్లుగా మాస్టర్ ప్లాన్ రోడ్లపై వీధి దీపాలు లేవని, అధికారులు హామీ ఇచ్చినా అమలు కాలేదని 6వ వార్డు ప్రజలు మొరపెట్టుకున్నారు.
- **బరియల్ గ్రౌండ్:** మధురవాడలో బరియల్ గ్రౌండ్ నిర్మాణానికి నిధులు మంజూరై, టెండర్లు కూడా పూర్తయినా రెవెన్యూ సిబ్బంది లోపం వల్ల పనులు జరగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్

- **లైఫ్‌గార్డ్‌ల వేతనాలు:** భీమిలి బీచ్ నుంచి అప్పికొండ బీచ్ వరకు లైఫ్‌గార్డ్స్‌గా 46 మంది విధులు నిర్వహిస్తున్నాం. బీచ్‌కు వచ్చే పర్యాటకుల ప్రాణాలకు రక్షణగా తీరం వెంబడి ఉంటున్నాం. వారి ప్రాణాలు ఎప్పటికప్పుడు కాపాడుతూ ఉన్నాం. ఇంతగా శ్రమిస్తున్నా జీతాలు సక్రమంగా రావడం లేదు. మా వేతనాల్లో ఈఎస్ఐ, పీఎఫ్ కట్ అయిన అమౌంట్ ప్రతినెలా సరిగ్గా కట్ కావడం లేదు. రూ.18వేలతో కుటుంబంతో బతకడానికి అనేక ఇబ్బందులు పడతున్నాం. జీతాలు పెంచి మమ్మల్ని ఆదుకోవాలి.

మౌలికసదుపాయాలు కల్పించాలి: 28వ వార్డులో సీసీ డ్రెయిన్లు, రోడ్లు, కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు వినతి పత్రం ఇచ్చారు. 22వ వార్డులో రోడ్లు తవ్వేసి వదిలేయడం, అంగన్వాడీల నిర్మాణం పూర్తి కాకపోవడం, డ్రెయినేజీ సమస్యలు, వీధి దీపాలు వెలగకపోవడం వంటి సమస్యలను ప్రజలు ప్రస్తావించారు.

అధికారులు సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, కేవలం ఫిర్యాదులు స్వీకరించడం తప్ప పరిష్కారం చూపడం లేదని పలువురు ఫిర్యాదుదారులు ఆరోపించారు.

118 వినతులు

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 118 వినతులు అందాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 349 వినతులు

బీచ్‌రోడ్డు : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 349 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు 111, జీవీఎంసీకి 54, పోలీసు విభాగానికి 15, ఇతర విభాగాలకు 169 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్‌లు ఈ వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడిన కలెక్టర్.. ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని, ఆన్‌లైన్ లాగిన్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా లాగిన్ చూడని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఆర్వోకు సూచించారు. టిడ్కో గృహ లబ్ధిదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అలాగే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని హెచ్చరించారు. స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మూడు నెలలు దాటినా స్పందన లేదు



గొట్టిపెల్లి గ్రామంలో సర్వే నంబరు 64-5లో నా భార్య కమల పేరు మీద ఉన్న 50 సెంట్ల భూమి అడంగల్‌లో వేరొకరి పేరు మీద తప్పుగా నమోదైంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో తమ పేరు నమోదు చేయమని కోరగా, వీఆర్వో తిప్పిస్తున్నాడు. రీసర్వే సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, చుట్టుపక్కల రైతులను విచారించి, ఈ భూమి కమల పేరు మీద నమోదు చేయాలని సూచించినప్పటికీ, అప్పటి వీఆర్వో నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. మార్చి నెలలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, అది ఆనందపురం తహసీల్దార్‌కు రిఫర్ చేశారు. ఇప్పటివరకు తమకు ఎటువంటి న్యాయం జరగలేదు. తమ వద్ద ఉన్న అన్ని డాక్యుమెంట్లను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలి.

–రౌతు అప్పలరాజు, గొట్టిపల్లి, ఆనందపురం

అనుమతులు లేకుండా హాస్టల్ నిర్వహణ



తమ ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో 'శివ ఉమెన్స్ హాస్టల్స్ అండ్ పీజీ' పేరుతో తొమ్మిదేళ్లుగా ఎటువంటి అనుమతులు లేకుండా హాస్టల్ నడుపుతున్నారు. నివాసానికి మాత్రమే అనుమతులు ఉన్న అపార్ట్‌మెంట్లను వాణిజ్యపరంగా వినియోగిస్తున్నారు. ఈ హాస్టల్‌కు ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ లైసెన్స్, కమర్షియల్ గ్యాస్ కనెక్షన్ వంటివి ఏవీ లేవు. చట్టబద్ధమైన అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తున్న వారిపైనా, వారికి అద్దెకు ఇచ్చిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలి.

–ఎండీ ఉద్దీన్, సీబీఎం కంపౌండ్

పెన్షన్ ఇప్పించండి



శరీరం మొత్తం కాలిపోయి, ఏ పనికీ వెళ్లలేని దుస్థితిలో ఉన్నాను. నాకు పింఛను మంజూరు చేయాలి. సచివాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. నాకు ఎటువంటి కుటుంబ ఆధారం లేదు. పింఛను మంజూరు చేస్తే జీవించడానికి అవకాశం కల్పించినవారవుతారు. ఉన్నతాధికారులు తన సమస్యను పరిష్కరించాలి.

–టి. శాంతివతి, తాటిచెట్లపాలెం

మాస్టర్ ప్లాన్ రోడ్డు మూసివేతపై ఆందోళన

- జెడ్సీ చాంబర్ ముందు బైఠాయింపు
- పరిశీలించిన అధికారులు
- అడ్డంకి తొలగించిన కాలనీ మహిళలు


జోనల్ కమిషనర్ చాంబర్ వద్ద బైఠాయించిన పలు కాలనీల ప్రజలు

మధురవాడ: కొమ్మాది జవహర్ నవోదయ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డును కొందరు వ్యక్తులు మూసివేయడంపై జేఎన్ఎన్‌యూఆర్ఎం కొమ్మాది 1, కొమ్మాది 2 తదితర కాలనీల ప్రజలు సోమవారం మధురవాడ జోన్–2 కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. 'రోడ్డును వెంటనే తెరిపించాలి', 'జోనల్ కమిషనర్ డౌన్ డౌన్' అంటూ సీఐటీయూ ఇతర ప్రజా సంఘాల నేతలు నినాదాలు చేశారు. సుమారు మూడు గంటల పాటు అక్కడే బైఠాయించి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. సమాచారం అందుకున్న పీఎంపాలెం ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో చర్చలు జరిపించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ సమస్య పరిష్కరిస్తామని అధికారులు ఏడాది క్రితం చెప్పినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. వేలాది మంది ప్రజలు ఈ రోడ్డు ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారని, దీనిని మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కోర్టు కేసులు ఉన్నాయని కొందరు వ్యక్తులు తరచుగా రోడ్డును మూసేస్తున్నారని, దీంతో బస్సు, ఆటోలు సహా ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయని చెప్పారు. ఒక న్యాయవాది తరచుగా దౌర్జన్యానికి దిగుతున్నారని, మహిళలపై చేయి చేసుకోవడం వంటి కారణాలతో అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మధురవాడ దళిత సంఘాల అధ్యక్షుడు సియాద్రి కనకరాజు మాట్లాడుతూ ఈ వ్యవహారంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. పైగా ప్రభుత్వ భూమికి టీడీఆర్ ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నించారు. అనంతరం, పీఎంపాలెం పోలీసులు, అధికారులు మూసివేసిన రోడ్డును సందర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు మూసివేసిన వ్యక్తితో మహిళలు వాగ్వివాదానికి దిగి, అడ్డుగా ఉన్న వాటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవతార్ సింగ్, కె.చిన్ని, వాసంతి, ఎండీ హుస్సేన్ బాబా, ఫాల్గుణ, చంద్రకళ రాము తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందాలు ఉల్లంఘించిన వారికే మళ్లీ లీజు

సిల్వర్ స్పూన్ రెస్టారెంట్‌పై కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు

డాబాగార్డెన్స్ : ఒప్పందాలు ఉల్లంఘిస్తున్న వ్యక్తికే మళ్లీ లీజుకు ఇవ్వడం చూస్తుంటే.. ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందోనంటూ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కమిషనర్ కేతన్ గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేసి జీవీఎంసీకి రావల్సిన ఆదాయాన్ని ఆ వ్యక్తి నుంచి వసూలు చేయాలన్నారు. బీచ్‌రోడ్డులోని 420 చ.గజాల ఖాళీ స్థలాన్ని మూడేళ్లకు రూ.1,60,565 నెలవారీ అద్దెపై కె.శ్రీనివాసరావు పేరు మీద సిల్వర్ స్పూన్ రెస్టారెంట్‌కు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పక్కన జీవీఎంసీకి చెందిన 1,600 చదరపు గజాల స్థలాన్ని అక్రమించి రెస్టారెంట్, ఇతరత్రా వినోద వాణిజ్య వ్యాపారాల నిర్వహణతోపాటు ఇతర వ్యక్తులకు సబ్ లీజ్‌కు ఇచ్చి అధిక లాభాలు పొందుతూ జీవీఎంసీకి నామమాత్రంగా అద్దె చెల్లించారన్నారు. లీజు కాలం ముగియడంతో కె.శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు అద్దె హెచ్చింపు చేస్తూ అదే వ్యక్తికి జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశంలో మరో మూడేళ్లకు పునరుద్ధరణ చేయడం జరిగిందన్నారు. కొన్నాళ్ల నుంచి 1,600 చదరపు గజాల జీవీఎంసీ ఖాళీ స్థలాన్ని ఆక్రమించి, ఆ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా రెస్టారెంట్, ఇతరత్రా వినోద వాణిజ్య వ్యాపారాల నిర్వహణ చేసుకుంటూ, ఇతర వ్యక్తులకు ఎక్కువ అద్దెకు ఇచ్చుకుని అధిక లాభాలు పొందారని చెప్పారు. జీవీఎంసీకి చెందిన రెవెన్యూ అధికారులు రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోకుండా ఒప్పందాలు ఉల్లంఘిస్తున్న వ్యక్తికి మళ్లీ ఇవ్వడమనేది చూస్తుంటే ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందో ఊహించుకోవచ్చని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి జీవీఎంసీకి రావల్సిన ఆదాయాన్ని ఆ వ్యక్తి నుంచి వసూలు చేయాలన్నారు. అక్కడ అదనంగా ఉన్న 1,600 చ.గజాల స్థలంలో జీవీఎంసీకి ఆదాయం చేకూరేలా వాణిజ్య సముదాయాల కోసం కొత్తగా టెండర్లు పిలవాలని కోరారు.

సీతమ్మధారలో 9 తులాల బంగారం చోరీ

తాటిచెట్లపాలెం: సీతమ్మధార సాయిబాబా గుడి సమీపంలో నివసిస్తున్న విక్రమాదిత్య ఇంట్లో భారీ చోరీ జరిగింది. వివరాలు.. సీతమ్మధారలో నివాసం ఉంటున్న విక్రమాదిత్య ఈ నెల 17వ తేదీన కుటుంబంతో కలిసి పశ్చిమగోదావరి జిల్లాలో గల బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి వీరు ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా 100 గ్రాముల బంగారం (సుమారు 9 తులాలు) దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేయగా..క్లూస్ టీం ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐరన్ డ్రమ్ పేలి ప్లైవుడ్ ఉద్యోగి దుర్మరణం

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలోని ఎవరెస్ట్ వెనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్లైవుడ్ కంపెనీ)లో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ ఉద్యోగి మృతి చెందాడు. మృతుడు రాజస్థాన్‌కు చెందిన మోలారాం జాట్ (43)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... మోలారాం జాట్ ఒక డ్రమ్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తుండగా అది ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ప్రమాదంలో అతని ముఖం తీవ్రంగా దెబ్బతిని, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● ఆకాశం.. మూడు ముద్రలు


ఎండలో


మబ్బుల్లో

భూమిని కాల్చేసే ఎండతో మొదలైన నిశ్శబ్ద దాహం, గగనతలంలో నిట్టూర్పుగా మారింది. ఆ దాహాన్ని చూసి కరుణించిన ఆకాశం, నల్లటి మేఘంగా ఆవరించింది. ఆశగా నిరీక్షించిన క్షణం రానే వచ్చింది. భూమిని తాకుతూ పడిన చిరుజల్లులతో సింహాచలం తడిసి ముద్దైంది.నగరంలో మాత్రం వరుణుడు ముఖం చాటేయడంతో సిటిజనులు నిరుత్సాహానికి గురయ్యారు. విశాఖలో సోమవారం ఇలా ఎండ..మేఘం.. వానతో ఆకాశంలో మూడు ముద్రలు చోటు చేసుకున్నాయి.


వర్షంలో..

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం